క్లుప్తంగా

అర్జీలు త్వరగా పరిష్కరించండి

అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతి



తెనాలిఅర్బన్: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మిపతి సూచించారు. 23వ వార్డులోని సచివాలయంను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయంకు వచ్చిన వారి పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం 7,21,23 వార్డులలో ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. వీధులలో వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వసతి గృహానికి ఆర్వో ప్లాంటు వితరణ



తెనాలి: డాక్టర్ బాబాసాహెచ్ వర్ధంతి రోజున భారతీయ స్టేట్‌బ్యాంక్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక సేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులు వసతిగృహంలో చదువుతున్న విద్యార్థులకు బ్యాంక్ మేనేజ్‌మెంట్ సహకారంతో మంచినీళ్ల ఆర్ఓ, 50 కుర్చీలు, అయిదు బీరువాలు అందజేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సునీల్ మేడికొండ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. బ్యాంకు సహకారంతో అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వీవీ జగదీష్‌కుమార్ మాట్లాడుతూ భారతీయ స్టేట్‌బ్యాంక్ ప్రజలకు ఆర్థిక సేవలనే కాకుండా సమాజ అవసరాలకోసం సహాయం చేస్తోందని తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఐ.నిరీక్షణరావు, సంఘ కోశాధికారి డి.విజయ్, ఉప కార్యదర్శి టి.చందన, గుంటూరు జోన్ కార్యదర్శి కె.ప్రదీప్, వి.శ్రీనివాసనాయక్, హెచ్‌ఆర్ మేనేజరు తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

నన్నే పన్ను కట్టమంటావా?

- ఇంటిపన్ను చెల్లించమన్నందుకు కౌన్సిలర్ ఆగ్రహం
- ఫోను చేసిన ఉద్యోగిని, సదరు అధికారిపై ఆగ్రహం
- మహిళా ఉద్యోగినికి తీసుకెళ్లి మరీ క్షమాపణ చెప్పించిన అధికారి

తెనాలిఅర్బన్: పట్టణంలో అధికార కూటమి పార్టీల నేతలకు కొందరు అధికారులు జీహుజూర్ అంటున్నారు. అధికార దర్పానికి కిందస్థాయి ఉద్యోగుల్నీ దాసోహం అనిపిస్తున్నారు. శుక్రవారం జరిగిన ఓ సంఘటన ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. మున్సిపాలిటీలో కలకలం రేపిన ఘటన వివరాలు 'సాక్షి' సేకరించిన ప్రకారం ఇలా ఉన్నాయి. పట్టణంలో ఆస్తిపన్ను వసూళ్ల డ్రైవ్ జరుగుతోంది. మైకులో వీధివీధినా అప్పీలు చేస్తూ చేస్తున్న ప్రచారం అలావుంచితే, మున్సిపాలిటీ నుంచి సదరు పన్ను చెల్లింపుదారు/బకాయిదారులకు ఫోన్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సంబంధిత అధికారి పన్నులు చెల్లింపుదార్ల నంబర్లను మున్సిపల్ కార్యాలయంలోని కొందరు ఉద్యోగులకు ఇచ్చి ఫోన్లు చేయించసాగాడు. అందరిలాగే ఇంజినీరింగ్ విభాగంలోని మహిళా ఉద్యోగిని ఒకరు తనకిచ్చిన ఫోన్ నంబర్లకు ఫోన్లు చేస్తూ, పన్ను చెల్లించాలని విజ్ఞప్తి చేయసాగారు. అలా ఒక ఫోను కూటమి పార్టీకి చెందిన మున్సిపల్ కౌన్సిలర్‌కు వెళ్లింది. తనకే ఫోన్ చేసి పన్ను చెల్లించాలని కోరటంతో ఆగ్రహోదగ్రుడయ్యాడు. 'నేను ఎవరినో తెలుసా' అంటూ తీవ్రస్వరంతో ప్రశ్నించారు. తన ఫోన్ నెంబరు ఎవరిచ్చారని ప్రశ్నించడంతో, తనకు పని పురమాయించిన అధికారి పేరు చెప్పారు. వెంటనే ఆ కౌన్సిలరు సదరు అధికారికి ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఆ అధికారి ఆ మహిళా ఉద్యోగిని వెంట బెట్టుకుని, కౌన్సిలరు వ్యక్తిగత కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడాయన లేకపోవటంతో ఫోన్ చేశాడు. కౌన్సిలరు చెప్పినట్టుగా అర్ధగంట తర్వాత మళ్లీ మహిళా ఉద్యోగినిని అక్కడకు తీసుకెళ్లి, కౌన్సిలరు వచ్చాక ఆయనకు క్షమాపణ చెప్పించాడు. తన తప్పు ఏమీ లేకుండా, అధికారి చెప్పినట్టు చేసినందుకు బయటకు వెళ్లి మరీ క్షమాపణ చెప్పాల్సి రావటంతో ఆ ఉద్యోగిని ఆవేదన అంతాఇంకా కాదు. ఈ విషయం మున్సిపల్ కార్యాలయంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రాణాలు తెల్లారిపోతున్నాయి!

- తెల్ల నంబరు ప్లేట్లతో అద్దె కార్ల దందా
- యథేచ్ఛగా ప్రైవేటు కార్లు అద్దెకు తిప్పుతున్న వైనం
- నిబంధనలకు పాతర, ప్రైవేటు నంబరు ప్లేటుతోనే అద్దెకు కార్లు

తెనాలిరూరల్: తెనాలి పట్టణం, చేబ్రోలు మండలంలో అద్దె కార్ల దంగా కొనసాగుతోంది. సాధారణంగా టాక్సీ ప్లేట్ (ఎల్లో ప్లేట్)తో అద్దెకు కార్లను ట్రావెల్స్‌కు వినియోగిస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్‌కు తిప్పే కార్లకు నలుపు బ్యాక్‌గ్రౌండ్ బమీద పసుపు అక్షరాలుతో ఉన్న నంబరరు ప్లేట్లను కేటాయిస్తారు. అలాంటిది వైట్ నంబరు ప్లేట్‌లతో ఉన్న కార్లనే అద్దెకు ఇస్తూ అక్రమంగా సొమ్ము చేసుకోవడంతో పాటు ప్రమాదాలకూ కారణమవుతున్నారు. విద్యార్థులే లక్ష్యంగా కొందరు ప్రైవేటు కార్లను అద్దెకు తిప్పుతున్నారు. పెద్ద మొత్తంలో అద్దె వసూలు చేస్తూ, లగ్జరీ, హై ఎండ్ కార్లను అద్దెకిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి చదువుకునేందుకు వచ్చిన పిల్లలకు అవసరాల నిమిత్తం వారి తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో కార్లను అద్దెకు తీసుకెళ్తున్నారు. ఇంతే కాక, మద్యం సేవిస్తూ, గంజాయి తాగుతూ కార్లలో తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నారు. డ్రైవింగ్ రాని వారికి ఇచ్చిన కార్లు ప్రమాదాలకు గురై నుజ్జు నుజ్జునుజ్జయిన ఘటనలూ ఉన్నాయి.

సిండికేట్‌గా ఏర్పడి కార్లు అద్దెకు..

ఈ విద్యార్థులను 'సొమ్ము' చేసుకునేందుకు కొందరు సిండికేట్‌గా ఏర్పడ్డారు. విద్యార్థులతో స్నేహం చేసి, ఖరీదైన కార్లను ఫైనాన్స్‌లో కొనుగోలు చేసి వారికే అద్దెకు ఇవ్వడం ప్రారంభించారు. సెల్ఫ్ డ్రైవింగ్‌కి కార్లు ఇచ్చేస్తుండడం, కేవలం కళాశాల ఐడీకార్డు, ఈ 'సిండికేట్'లో తెలిసిన వారి హామీతో



ఇటీవల ప్రమాదానికి గురైన కారు

కార్లను అప్పజెప్పేస్తున్నారు. నలుగురైదుగురు విద్యార్థులు కలసి కారును తీసుకుని వెళుతున్నారు. డ్రైవర్‌తో పని లేకపోవడం, కాస్తో కూస్తో డ్రైవింగ్‌పై అవగాహన ఉండడంతో కారును తీసుకుని సుదూర ప్రాంతాలకు సైతం వెళుతున్నారు. ఒక్కో కారుకు 12 గంటలకు రూ. 3,500, 24 గంటలకయితే రూ. ఐదు వేల వరకు అద్దె వసూలు చేస్తున్నారు..

డ్రైవింగ్ రాక ప్రమాదాలు..

ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదవే విద్యార్థులే లక్ష్యంగా ఈ దందా నడుస్తోంది. మైనర్లకు సైతం కార్లను ఇస్తున్నారు. కొంత కాలం క్రితం తెనాలి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రోడ్డులో మైనర్ అద్దెకు తీసుకున్న కారు అదుపు చేయలేక ప్రమాదానికి కారకుడయ్యాడు. వెలుగు–హనుమాన్‌పాలెం రోడ్డులోనూ సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు పొలాల్లోకి పల్టీ కొట్టిన ఘటనలూ ఉన్నాయి.

నిబంధనలు ఇవీ..

రెంటల్ కారుకు కమర్షియల్(ట్రాన్స్‌పోర్టు) కారుకు ఉన్న నిబంధనలే వర్తిస్తాయి. ట్రాన్స్‌పోర్టు కారుకు పసుపు ప్లేటు మీద నల్ల అక్షరాలతో కూడిన నంబరు ప్లేటు ఉంటుంది. మూడు నెలలకోసారి క్వార్టరీల ట్యాక్స్ కట్టాలి. ఆరు సీట్లలోపు ఉన్న కార్లకు ఈ ట్యాక్స్ మినహాయింపు ఉంది. సెవన్ సీటర్ కారుకు మూడు నెలలకు రూ. 5650 చెల్లించాల్సి ఉంది. 10 సీటర్, 12 సీటర్‌కు కారును బట్టి ట్యాక్స్ ఉంటుంది. ఈ కార్లు నడిపేందుకు డ్రైవరుకు కమర్షియల్ లైసెన్సు ఉండాలి. సెల్ఫ్ డ్రైవింగ్‌కు ఇచ్చే రెంటల్ కార్లకు ఇదే తరహాలో నలుపు మీద పసుపు లక్షరాల నంబరు ప్లేటును ఇస్తారు. ఈ ప్లేట్లు ఉన్న కార్లనే అద్దెకు/సెల్ఫ్ డ్రైవింగ్‌కు తిప్పాల్సి ఉంటుంది. సాధారణంగా వ్యక్తిగత పనులకు వినియోగించుకునే కార్లకు తెలుపు మీద నల్ల అక్షరాలతో ఉన్న వైట్‌నంబరు ప్లేటు ఇస్తారు. వాహనంతో వ్యాపారం / ట్రాన్స్‌పోర్ట్ చేస్తే కచ్చితంగా పసుపు లేదా నల్ల రంగు ప్లేటు తీసుకోవాలి. అలా కాకుండా వైట్‌నంబరు ప్లేటుతో ఉన్న కార్లను అద్దెకు తిప్పినా సెల్ఫ్ డ్రైవింగ్‌కు ఇచ్చి దొరికితే కార్లను సీజ్ చేసే అధికారుల రవాణా శాఖ అధికారులకు ఉంది. ఈ నిబంధన లేవీ ఇక్కడ అమలులో లేవు.

ట్రావెల్స్ నిర్వాహకులకు తీవ్ర నష్టం

సాధారణంగా టాక్సీ ప్లేట్ ఉన్న కార్లలో వెళ్లడానికి ప్రజలు ఇష్టపడరు. సెల్ఫ్ డ్రై వింగ్‌కు వైట్ నంబర్ ప్లేట్ కార్లను అద్దెకిస్తుండడం అద్దెకు తీసుకున్న వారే వాటిని నడపడంతో వాటివైపే మొగ్గు చూపుతున్నారు. ఈ విధానం వల్ల ట్రావెల్స్ నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే ప్రై వేటు ట్రావెల్స్ రంగం తీవ్ర నష్టాల్లో ఉంది. ట్రావెల్స్‌ను నమ్ముకున్న డ్రై వర్లు ఉపాధి కోల్పోతున్నారు. ఈ అక్రమ దందాకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

అధికారుల చర్యలు శూన్యం

ఇంత తతంగం జరుగుతున్నా, సంబంధిత అధికారులు మాత్రం తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సంబంధితులపై కఠిన చర్యలు తీసుకోవల్సిన పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అంతే కాక, విద్యార్థులు కదా.. అన్న కారణంతో వారిపై కేసులు నమోదు చేయడం లేదు. ట్రావెల్స్ (అద్దెకు వాహనాలను నడిపేవారు)కు సంబంధించిన వాహనాలన్నీ పసుపు రంగు నంబర్ ప్లేట్లు కలిగి ఉండాలి. అలా కాకుండా ఈ దందాలో కారులన్నీ వైట్ నంబర్ ప్లేట్లలోనే ఉండడం గమనార్హం. అయినా రవాణా శాఖ అధికారులు తమకు తెలియనట్టే ఉంటున్నారు. దీంతో కార్లలో షికారుకు అలవాటు పడ్డవారికి క్లెయిం వేసే వారు లేకుండా పోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పటిష్ట చర్యలు తీసుకుంటే అనర్థాన్ని కాపాడిన వారవుతారన్న భావన వినిపిస్తోంది.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం



అద్దెకు కార్లు తిప్పే వారు నిబంధనలు పాటించాల్సి ఉంది. ఆరు సీటర్లలోపు కార్లకు లైఫ్‌టాక్స్ కట్టి, పసుపు లేదా నల్ల ప్లేటు తీసుకోవచ్చు. అలా కాకుండా తెల్ల ప్లేటు మీద కార్లను అద్దెకు తిప్పితే చర్యలు తీసుకుంటాం. ఇటువంటి వారిపై నిఘా ఉంచి అవసరమైన చర్యలు తీసుకుంటాం. భవిష్యత్తులో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.

–కె. శ్రీహరి, ప్రాంతీయ రవాణా అధికారి, తెనాలి

తెనాలి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- విరిగిన ఎముకకు కండ తొడిగి శస్త్ర చికిత్స.
- వెంటనే శస్త్ర చికిత్స చేయటంతో తొలగిన ప్రమాదం

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలోని ఆర్థోపెడిక్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను చేశారు. విరిగిన ఎముకకు అతికొద్ది గంటలలోనే ప్లాస్టిక్ సర్జరీ చేసి రోగి నడిచేందుకు వీలు కల్పించారు. వైద్యులు కథనం ప్రకారం... కొల్లూరు మండలం రావికంపాడుకు చెందిన ప్రేమ్‌కుమార్(24) ద్విచక్రవాహనంపై గురువారం రాత్రి 10 గంటల సమయంలో వస్తు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కుడికాలు మోకాలు వద్ద వెముక విరిగిపోయి కండంత చిద్రమైంది. వెంటనే అతడు జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం రావటంతో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జె.హనుమంతరావు అతడికి పరీక్షలు చేశారు. 8 నుంచి 12 గంటలలోపు ప్లాస్టిక్ సర్జరీ చేయకపోతే ఎముక చచ్చుపడే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆరోగ్యశ్రీ కింద నమోదు చేయించి శుక్రవారం ఉదయం ప్లాస్టిక్ సర్జరీ చేశారు. విరిగిన ఎముకకు రాడ్లు వేయటంతో పాటు ప్రక్కన



రోగి కాలుకు ప్లాస్టిక్ సర్జరీ చేస్తున్న దృశ్యం

ఉన్న కండను దానిపై వేసి చర్మానికి కుట్లు వేశారు. సాధారణంగా ఇలాంటి కేసులకు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో శస్త్ర చికిత్సలు చేస్తుంటారు. కానీ తెనాలి జిల్లా వైద్యశాలలోని సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జే హనుమంతరావు, డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎనస్తీషియా వైద్యులు డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ మజీదా బేగంలు రోగికి ప్లాస్టిక్ సర్జరీ చేసి ప్రాణాపాయం తప్పించారు. వీరికి వైద్యశాల అధికారులు అభినందనలు తెలిపారు. అలాగే రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయవాదుల నిరసన

తెనాలిరూరల్: తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ న్యాయవాదులకి ఇబ్బందులు గురిచేసేలా ఉందని దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ తీసుకొచ్చిన న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ లోపభూయిష్టంగా ఉందని ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా ఎక్కువ మొత్తాన్ని పాలసీ రూపంలో న్యాయవాదుల నుంచి వసూలు చేసేదిగా ఉందన్నారు. ఈ రెండు చట్టాల్ని వెంటనే రద్దు చేయాలని విధులు బహిష్కరించినట్టు తెలిపారు. ఈ చట్టాలను వెనుక్కు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని రోజులపాటు ఉద్యమాన్ని తీవ్రతరం చేసి నిరాహార దీక్షలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి హరిదాస్ గౌరీ శంకర్, మధిర సురేష్, గుంటి సురేష్ కుమార్, కొండయ్య, కిషోర్ కుమార్, అబ్రహం లింకన్, దుర్గాప్రసాద్, తలతోటి సుధాకర్, కనపర్తి మధుకర్, గుమ్మడి రవి రాజ్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి

సబ్ కలెక్టర్ సంజనా సింహ

తెనాలిరూరల్: రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సబ్ కలెక్టర్ వి. సంజనా సింహ అన్నారు. తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఉదయం నుంచి జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామస్తులు, రైతులు తమ తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 6 వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలో తెనాలి మండలంలో నందివెలుగు గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించామని చెప్పారు. జనవరి 8 వ తేదీలోగా మండలంలోని 18 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ సదస్సులో రైతులు వారికి సంబంధించినటువంటి పలు సమస్యల్ని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని, అలానే ప్రజా సమస్యలు కూడా పరిష్కారం చేస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి సరేవ, మ్యుటేషన్, పొలం వైశాల్యం వంటి పలు సమస్యలను నివేదిస్తూ 17 అర్జీలు వచ్చాయి. వీటిని త్వరలో పరిస్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధూళిపాళ్ల వెంకట పవన్ కుమార్, పంచాయితీ కార్యదర్శి బి.హేమ కుమారి మండల సర్వేయర్, అధికారులు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనాసింహ, తహసీల్దార్ గోపాలకృష్ణ

రెవెన్యూ సదస్సులు ఉపయోగించుకోవాలి

వల్లభాపురం(కొల్లిపర): గ్రామాలల్లో రెవెన్యూ సమస్యలు తొందగా పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు , గ్రామాలలో రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ సమస్యలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులలో అర్జీలు అందిస్తే అధికారులు వెంటనే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సమస్యను పరిశీలించి అర్హత ఉంటే వెంటనే వాటిని అక్కడే పరిష్కరించటం జరుగుతుందని మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్.జె.కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురం గ్రామలో గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ తహసీల్దారు గోపాలకృష్ణా సదస్సును పరిశీలించి, అధికారులకు పలుసూచనలు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అవుతు పోతిరెడ్డి, ఎంపీడీవో వి.విజయలక్ష్మి, ఉప్పల రాజేష్ , ఆర్ఐ వంశీకృష్ణ , విఆర్వో అళ్ళ సుస్మ, వంగా సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వల్లభాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న స్పెషల్ ఆఫీసర్ ఆర్.జె.కృష్ణారావు , ఇన్చార్జ్ తహసీల్దారు గోపాలకృష్ణ



వల్లభాపురంలో సదస్సులో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

నెహ్రూనికేతన్‌లో కాలేజీ క్రీడాపోటీలు

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని నెహ్రూ నికేతన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం అంతర కళాశాల క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి ఈ పోటీలను ప్రారంభించారు. నాలుగురోజులు జరిగే పోటీల్లో తొలిరోజున బాలురకు వాలీబాల్, బాలికలకు 'సెలెక్ట్ ది కోంచ్' ఆటలను జరిపారు. చదువు, మార్కుల తోపాటు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కోసం కాలేజిలో ఏటా క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బాల్యంనుండే క్రీడల్లో ఆసక్తిని కల్పించి, ఆసక్తి కలిగిన క్రీడల్లో శిక్షణనిస్తే మంచి ఫలితాలను సాధిస్తారని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ వి.శేషగిరిరావు, వైస్‌ప్రిన్సిపాల్ పీఎస్ శంకర్ పర్యవేక్షించారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పురోగమిస్తోందని తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గంగానమ్మ పేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి అన్నాబత్తుని శివకుమార్ పుష్పాంజలి ఘటించారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ప్రజలందరి ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా బాధ్యతలు, హక్కులకు ప్రాధాన్యమిస్తూ డాక్టర్ అంబేడ్కర్ అద్భుతమైన రాజ్యాంగాన్ని రచించినట్టు చెప్పారు. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అనుసరిస్తూ పరిపాలన సాగించారని గుర్తుచేశారు. అదేవిధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు వెళుతున్నట్టు పార్టీ నాయకులు చెప్పారు. పార్టీ అక్కిదాసు కిరణ్ కుమార్, దుబాయ్ బాబు, కఠారి హరీష్, కొమ్ము రాయల్, గోల్డ్ రహీమా, పెచ్చింగ్ సుభానీ, మల్లెబోయిన రాము, కాళిదాసు సత్యం, కావేటి నిర్మల తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించినవారిలో ఉన్నారు.

చినరావూరులో...

స్థానిక చినరావూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సల్ యూత్ ఆధ్వర్యంలో యూత్ అధ్యక్షుడు, న్యాయవాది పిల్లి ప్రేమరాజు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. న్యాయవాది పిల్లి ప్రేమరాజ్, దేవరపల్లి కిషోర్, కనపర్తి డేవిడ్, పిల్లి వీరయ్య, గోవతోటి ఎలీషా, రాఘవులు, జస్వంత్, డేవిడ్, భూషణం, వెంకట్రావు, కిషోర్, నాగేశ్వరరావు, బెన్నీ, బుజ్జి, యూనివర్సల్ యూత్ సభ్యులు రజనీ, గేరా ఏసురత్నయ్య, సూరిబాబు, రామకృష్ణయ్య, ప్రసాద్, బన్ను తదితరులు పాల్గొన్నారు.

ఐక్యవేదిక ఆధ్వర్యంలో...

భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 68 వర్ధంతి పురస్కరించుకుని ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ రోడ్లో గల డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యాతాటి అనిల్, కొమ్ము రాయల్, షేక్ దుబాయ్ బాబు, షేక్ సలీం, కసుకుర్తి మల్లేశ్వరరావు, బడుగు రమేష్, కనపర్తి ఏసుబాబు బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికే గర్వకారణమైన మహనీయుడని కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా రామకృష్ణ అన్నారు. స్థానిక ముత్యంశెట్టిపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించి, ఘన నివాళులర్పించారు. అశోక్, సాయికృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని

అంబేడ్కర్ రాజ్యాంగమే దేశాన్ని నడిపిస్తోంది

తెనాలిరూరల్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగమే దేశాన్ని నడిపిస్తోందని విశ్రాంత అధ్యాపకుడు పినపాటి రాజశేఖర్ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని మారిస్‌పేటలోని బాబుజగ్జీవన్‌రామ్(బీజేఆర్) కమిటీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజశేఖర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు సమానత్వం సాధించేలా రిజర్వేషన్‌లు అందించడంలో అంబేడ్కర్ చూపిన చొరవ ఎనలేనిదన్నారు. అత్తోట శ్యామ్, కొండముది బోస్, కొమ్ము రాయల్, సిద్దెల కమలాకర్, నలుకుర్తి సద్గుణరావు, నలుకుర్తి రమేష్, బొంత చంటి, గాజులవర్తి ప్రదీప్, పినపాటి మణికుమార్, పినపాటి కొండలరాజు, పినపాటి జనార్ధన్ పాల్గొన్నారు.

బీఎస్‌పీ సెంటర్లో...

స్థానిక ఐతానగర్ బీఎస్‌పీ సెంటర్లోనవ భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు బొనిగల ప్రదీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమానికి పట్టణ టూ టౌన్ సీఐ కె.రాముల నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అందరికీ సమాన విద్య, ఆరోగ్యం, ఉపాధి, రక్షణ, నివాసం, భావ ప్రకటనకు సమన్యాయాన్ని రాజ్యాంగంలో పొందుపరిచిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. సమ సమాజ నిర్మాణంలో బాబాసాహెబ్‌ను ప్రపంచ దేశాలు అలాగే ఐక్యరాజ్య సమితి సింబల్ ఆఫ్ నాలెడ్జ్ గా గుర్తించారని తెలిపారు. ప్రముఖ న్యాయవాది పిల్లి విద్యాసాగర్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, దళిత ఉద్యమ నేతలు మేకతోటి ప్రభాకర్, డాక్టర్ కనపర్తి బెనహర్, యండ్రపాటి అశోక్ కుమార్ ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షులు అక్కిదాసు కిరణ్ కుమార్, బిఎస్పి తెనాలి నియోజకవర్గ ఇన్చార్జి కారుమంచి సునీల్ సందీప్, చెరుకుపల్లి నాగార్జున, యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ కారుమంచి రవికుమార్, సీనియర్ అంబేడ్కరిస్ట్ భీమ్రేడ్ శేషు, న్యాయవాది మధిర నాగేశ్వరరావు, బీఎస్‌పీ సెంటర్ యువత పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఐక్యవేదిక

జైభీమ్ ఫెడరేషన్‌లో...

ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 68 వ వర్ధంతిని పట్టణంలోని జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు కొవెవరపు దేవానంద్ మాట్లాడుతూ భారత దేశంలో ఒక దళితులకు మాత్రమే అంబేడ్కర్ నాయకుడని చిత్రీకరిస్తున్నారని చెబుతూ, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రతి భారతీయుడికి వర్తించేలా, వారి హక్కుల గురించి, వారికి రావాల్సిన వాటాల గురించి క్లుప్తంగా భారతదేశ ప్రజలకి రాజ్యాంగాన్ని అంకితం చేశారని అన్నారు. ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ సుదీర్ కుమార్‌ను సత్కరించారు. ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ అధినేత పాస్టర్ భానుప్రసాద్, ఫెడరేషన్ సభ్యులు సయ్యద్ ఆష, ఎంపీటీసీ పేరం అరుణ, కటివరపు గోవాకుమారి, రామారావు, పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

తెనాలిఅర్బన్: తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లెప్రో సొసైటీ సహకారంతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 10 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున శుక్రవారం పాత ప్రభుత్వ వైద్యశాలలో అందజేశారు. ఈ సందర్భంగా లెప్రో సొసైటీ కో ఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల సంక్షేమానికి డబుల్ హార్స్ ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ డి.రమాదేవి, ఫైలేరియా ఎస్‌హెచ్ఐ రవికుమార్, లెప్రో సొసైటీ ప్రతినిధులు ఏవీ భాషా, రమణయ్య పాల్గొన్నారు.

మందుల దహనంపై విచారణ

తెనాలిఅర్బన్: తెనాలి సుల్తానాబాద్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన మందుల దహనంపై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అన్నపూర్ణ శుక్రవారం విచారణ జరిపారు. అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లి దహనం చేసిన మందుల వివరాలు నమోదు చేసుకున్నారు. కాలపరిమితి ముగిసిన తక్కువ మోతాదులోని మందులను బయో వేస్ట్ సిబ్బందికి అందజేయకుండా వాటిని సిబ్బంది దహనం చేసినట్లు విచారణలో తేలినట్లు చెప్పారు. ఫార్మసిస్ట్‌కు మెమో ఇచ్చినట్లు తెలిపారు. ప్రథమ తప్పుగా భావించి చర్యలు తీసుకోకుండా వదిలేసినట్లు తెలిపారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకోవాలని హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

కాడి తగిలి వృద్ధుడి మృతి

ల్లభాపురం(కొల్లిపర): ఎడ్ల బండి కాడి తగిలి, బండి టైరు క్రింద పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి వల్లభాపురంలో చోటు చేసుకుంది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వల్లభాపురం గ్రామంలో యాదవపాలెంలో మాధవరావు (70) అనే వృద్ధుడు ఒంటరిగా జీవిస్తున్నాడు. ఇతను ఇంటి వద్ద నుంచి గ్రామంలో ప్రధాన కూడలికి వెళుతున్న సమయంలో పక్కనే వెడుతున్న ఎద్దులబండి బెదరడంతో కాడి తగిలి బండి టైరు క్రిందపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే 108 ద్వారా తెనాలి వైద్యశాలకు తరలించారు. అయితే మార్గమధ్యంలో అతను మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో భార్య అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుండి ఒంటరిగా జీవిస్తున్నాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు పెళ్లి చేసుకొని రామచంద్రపాలెంలో కూలి పనులు చేసుకుంటూ అక్కడ జీవిస్తున్నాడు. కుమార్తెలకు కూడా పెళ్లి అయ్యింది. మృతుడు మాధవరావు సొంత గ్రామం హనుమాన్‌పాలెం అక్కడి నుంచి భార్య సొంత గ్రామైన వల్లభాపురం వచ్చి గత కొని ఏళ్లుగా ఉంటున్నాడు.

అనారోగ్యంతో వృద్ధుడి మృతి

తెనాలిరూరల్: స్థానిక మున్సిపల్ మార్కెట్ ఎదుట వృద్ధుడి అనార్యోంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడిని కొల్లిపర మండలం అన్నవరం గౌడ కాలనీకి చెందిన జన్ను సాంబశివరావు (65)గా గుర్తించారు. మార్కెట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్దుడు మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని బంధువులకు బంధువులకు అప్పగించారు. అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.